ప్రజాశక్తి

బుధవారం 21 జూన్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విలీన దెబ్బ



- 410 సబ్జెక్టు టీచర్ పోస్టులు రద్దు
- 199 యుపి స్కూళ్లలో ఎస్‌జిటిలతో బోధన
- మరింత దిగజారనున్న విద్యా ప్రమాణాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

నూతన జాతీయ విద్యా విధానం పేద విద్యార్థుల పాలిట ముప్పుగా మారింది. ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు దిగజారేలా ప్రభుత్వ విధానాలున్నాయి. కొన్ని కొలమాణాలతో పాఠశాలలు, తరగతులను ఇతర పాఠశాలల్లో విలీనంచేసి, గ్రామాలకు అందుబాటులో ఉండే ప్రాథమిక విద్యను దూరం చేసింది. తాజాగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 199 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (యుపి)ల్లో 98 మంది కంటే విద్యార్థుల సంఖ్య తక్కువుందని మొత్తం 410 సబ్జెక్టు టీచర్ పోస్టులను రద్దు చేసి, సర్దుబాటుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం వెనుకాముందు చూడకుండా అత్యంత వేగంగా అమలుచేస్తున్న నూతన విద్యా విధానాల వల్ల ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పడిపోవడానికి దారితీయనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా సబ్జెక్టు టీచర్లులేక పది ఫలితాలు పడిపోయాయి. సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రాథమికోన్నత పాఠశాల నుంచి సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాల్సిన ప్రభుత్వం తగ్గిస్తోంది.

విద్యార్థుల సంఖ్య 98 మంది కంటే లోపున్నారని 410 వివిధ సబ్జెక్టు టీచర్ల పోస్టులు రద్దు చేసింది. కొద్ది రోజుల్లో కొత్తగా విద్యార్థులు చేరాక 98 మంది కంటే విద్యార్థులు పెరిగినా, ఈ ఏడాది సబ్జెక్టు టీచర్లు పునరుద్ధరించే అవకాశంలేదు. తరగతుల విలీనంచేసి ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించి, విద్యపై పెడుతున్న ఖర్చులు మిగుల్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నంలో ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేస్తోంది. గతంలో కొన్ని ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులు యుపి పాఠశాలల్లో విలీనమయ్యాయి. విలీనమైన యుపి పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ప్రశ్నార్థకంగా మారింది. యుపి పాఠశాలకు కేటాయించిన నలుగురు ఎస్‌జిటిలు సబ్జెక్టు బోధిస్తారని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. పాఠశాల తరగతులు విలీనంకాకముందు యుపి స్కూళ్లో లెక్కలు, ఫిజికల్ సైన్సుతో పాటు సంఖ్యను బట్టి ఇంగ్లీష్, బయోలాజికల్ సైన్సు బోధన ఉపాధ్యాయులుండేవారు. నాణ్యమైన విద్యకోసం తరగతులను విలీనంచేసినట్లు చెప్పిన ప్రభుత్వం, విలీన ప్రక్రియ జరిగాక విద్యార్థులు తక్కువున్నారన్న పేరుతో సబ్జెక్టు టీచర్లను లేకుండా చేసింది.

98 మంది మంది కంటే తక్కువున్న యుపి స్కూళ్లు

అల్లూరి జిల్లాలో	: 71
అనకాపల్లి జిల్లాలో	: 110
విశాఖపట్నం జిల్లాలో	: 18
మొత్తం	: 199

సబ్జెక్టుల వారీగా రద్దుచేసిన టీచర్ పోస్టులు

లెక్కలు	: 149
సోషల్	:142
తెలుగు	: 37
హిందీ	: 36
బయోలాజికల్ సైన్సు	: 24
ఇంగ్లీష్	: 20
ఫిజికల్ సైన్సు	: 2
మొత్తం	:410

ఓలా, ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.జగన్
- చలో కలెక్టరేట్‌లో 420 మంది అరెస్ట్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఓలా, ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ఓలా, ఉబర్ డ్రైవర్లు 'చలో కలెక్టరేట్' చేపట్టారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపవద్దంటూ పోలీసులు డ్రైవర్లు, నాయకులపై విరుచుకుపడ్డారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.జగన్‌తో సహా నాయకులు శ్రీను, చంటిలను, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులను, సభ్యులను కలిపి మొత్తం 420 మందిని పోలీసులు అరెస్టుచేశారు. సాయంత్రం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా బి.జగన్ మాట్లాడుతూ, ఓలా, ఉబర్ యాజమాన్యాలు గూగుల్ యాప్ ద్వారా డ్రైవర్లను లింక్ చేసుకొని 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నారన్నారు. దీనిపై కలెక్టర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని డ్రైవర్ల దగ్గర తీసుకుంటున్న కమిషన్ కేరళ రాష్ట్రం తరహాలో 8 శాతానికి తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా కిలోమీటర్ల రేట్లు పెంచాలని, తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, గతంలో మాదిరిగా ఇన్సెంటివ్స్ ఇవ్వాలని, ఓలా ఆఫీస్‌ను విశాఖలో ఏర్పాటు చేయాలని, సమస్య వస్తే పరిష్కరించే అధికారిని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు, కమిటీ మెంబర్స్ లక్ష్మీనారాయణ, ఆనంద్, గోపి, పోలినాయుడు, చంటి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



కార్లతో ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న క్యాబ్ డ్రైవర్లు

ఆస్తి విలువ పెంపుదలను ఉపసంహరించాలి

▶ వార్త 2లో..

టిటిడి శ్రీవాణి ట్రస్టుకు భద్రత ఉందా..? : బండారు

▶ వార్త 2లో..

విద్యుత్ ఛార్జీల పెంపుపై సిపిఎం నిరసన

▶ వార్త 4,5లో..

సిరిపురం కూడలి అభివృద్ధికి ప్రణాళికలు

జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ



సిరిపురం కూడలిలో పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : సిరిపురం (ద్రోణంరాజు సర్కిల్) కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూడవ జోన్ పరిధిలోని ద్రోణం రాజు సర్కిల్, బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ద్రోణంరాజు కూడలిలో వ్యర్థాలతో తయారుచేసిన విభిన్న ఆకృతులను ఆకర్షణయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించి పనులు త్వరతిగతిన పూర్తిచేసి ఈ నెలాఖరుకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్కే బీచ్ నుంచి ఫామ్ బీచ్ వరకు శాండ్ బీచ్ క్లీనింగ్ నిర్వహించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. బీచ్‌లో వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, అవి ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు వినయ్ కుమార్, వేణుగోపాల్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణానందస్వామిని శిక్షించాలి

ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వెంకోజిపాలెంలోని జ్ఞానానంద రామానంద ఆశ్రమంలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంపూర్ణానందస్వామి ని కఠినంగా శిక్షించాలని, ఆశ్రమంపై వెంటనే న్యాయవిచారణ జరిపించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ డిమాండ్ చేశారు. ఐద్వా, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన మద్దిలపాలెం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. జ్ఞానానంద ఆశ్రమంలో రెండేళ్ల నుంచి బాలికపై స్వామి అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. స్వామి ముసుగులో ఈ కామందుడు మానవమృగంలా ప్రవర్తించాడని, అతన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఇటువంటి ఘటనల పట్ల పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న కారణంగానే పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. ఆధ్యాత్మిక ముసుగులో జరుగుతున్న మోసాలను వెలికితీయాలని, ఆశ్రమాలను మూసివేయాలని, వాటిపై సోషల్ ఆడిటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టాన్ని రద్దు చేయాలని కోరుతున్న స్వామీజీలు ఈ దుర్మార్గంపై పెదవి విప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఐద్వా మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.



మద్దిలపాలెంలో నిరసన తెలుపుతున్న ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

వికలాంగుల దీక్షకు వెంకటరెడ్డి సంఘీభావం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కాకినాడ (రూరల్) రాయుడుపాలేకి చెందిన వికలాంగురాలు సాయిలక్ష్మి చంద్ర చేపట్టిన దీక్షకు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి సంఘీభావం తెలిపారు. వికలాంగుల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాయిలక్ష్మి చంద్ర చెందిన ఆస్తిని కాజేయాలని మంత్రి దాడిశెట్టి రాజా అండదండలతో గన్‌మెన్లు మెరపల శివ, కన్నయ్యలు దౌర్జన్యం చేశారని, ప్రాథమిక దర్యాప్తులో నేరం రుజువైనందున ఎఫ్ఐఆర్ బుక్ చేశారని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోకుండా విఆర్ఎస్ తీసుకోవడం అంటే నేరస్తులను కాపాడడానికేనని అర్థమవుతుందని పేర్కొన్నారు. సాయి లక్ష్మి చంద్రకి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకెళ్తున్నామని చెప్పి మానసిక ఆసుపత్రిలో చేర్పించి మానసిక రోగిగా సృష్టించడాన్ని చూస్తుంటే కేసును పక్కదారి పట్టించడానికేనని అర్థమవుతుందన్నారు.

ఆటోలపై పోలీస్ ఈ- చలానాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ జిల్లాలోని ఆటో డ్రైవర్లపై వేసిన పోలీస్ ఈ- చలానాలు రద్దు చేయాలని ఎపి ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం సెంట్రల్ పార్క్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జరిమానాలను పెంచుతూ విడుదల చేసిన జిఒ 21ని రద్దుచేయాలని, లారీలు, టాటా మ్యాజిక్ వ్యానులు, కార్లపై రోడ్ టాక్స్ 30 శాతం పెంచుతూ విడుదల చేసిన జిఒ 31ని కూడా రద్దు చేయాలన్నారు.

శోభాయమానంగా జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : టౌన్ కొత్త రోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర అత్యంత శోభాయమానంగా జరిగింది. మంగళవారం ఉదయం జగన్నాథ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయ కొట్టి జగన్నాథస్వామి తొలి రథయాత్రను ప్రారంభించారు. అనంతరం భక్తులు రథాన్ని ముందుకు లాగారు. తొలి రథయాత్ర మెయిన్‌రోడ్ నుంచి టర్నర్ సత్రం వరకు సాగింది.

విద్యుత్ అదనపు ఛార్జీలపై సిపిఎం సర్వే

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విద్యుత్ బిల్లుల అదనపు భారాలపై జివిఎంసి 18వ వార్డు అంజయ్యనగర్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన సర్వే చేపట్టారు. కాలనీలో ప్రజలను 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కలిసి విద్యుత్ బిల్లులు ఎందుకు ఎక్కువ వచ్చాయి అని అడిగి తెలుసుకున్నారు. బిల్లులను పరిశీలించారు. విద్యుత్తు చార్జీలు భారాన్ని ప్రజలపై రుద్దితే ఎలా బ్రతకాలని ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సర్వేలో సిపిఎం అంజయ్య నగర్ స్థానిక నాయకులు జె.కోదండరావ్, ఎం.చంటి, ఎన్‌వి.రమణ, జి.సంతోష్, జె.గోవిందరావు, సరోజినీ, నాగమణి, రాజేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రమాదాలు ఇతర కారణాలతో కాళ్ళు, చేతులు పోగొట్టుకొని ఇబ్బంది పడుతున్న వికలాంగులకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కృత్రిమ అవయవ నిర్మాణ కేంద్రం ద్వారా మంగళవారం కృత్రిమ అవయవాలను అందించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి మాట్లాడుతూ, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న 8 మందికి కృత్రిమ కాళ్ళ (లింబ్స్), పోలియో ద్వారా అంగవైకల్యం పొందిన ఐదుగురికి కాలిబర్లు అందించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు ఎవరైనా కృత్రిమ అవయవాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వారం రోజుల్లో కృత్రిమ అవయవాలు అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వల్లూరి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మూడో పట్టణ క్రైం పోలీస్ స్టేషను పరిధి మంగాపురం కాలనీ, తారా మసీదు రోడ్డులో రెండు వేర్వేరు ఇళ్లలో జరిగిన చోరీని నాలుగు గంటల్లోనే పోలీసులు ఛేదించారు. డయల్ 100కు ఫోన్ వచ్చిన నాలుగు గంటల కాలంలోనే దొంగను పట్టుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు క్రైం ఎసిపి సునీల్ తెలిపారు. 3వ పట్టణ పోలీస్ స్టేషనులో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మధురవాడ కొమ్మాది ప్రాంతానికి చెందిన నిందితుడు మరడ సాయి (సొర పిట్టలు) చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తూ జల్సా ఖర్చులు చేస్తాడని చెప్పారు. ఇతని మీద 13 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ఎస్ఐ సురేష్‌కుమార్, ఎఎస్ఐ కిషోర్ కుమార్, కానిస్టేబుళ్లు అప్పలరాజు, రవికుమార్ పాల్గొన్నారని ఎసిపి సునీల్ తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ ఉంటే చర్యలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉంటే చర్యలు తప్పవని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ మంగళవారం హెచ్చరించారు.

ఆస్తి విలువ పెంపుదలను ఉపసంహరించాలి

వార్వా, నివాస్ డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఆస్తి పన్ను పెంపుపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా పన్నులు పెంచి, ప్రజలపై రుద్దడం అన్యాయమని, ఆస్తి విలువ పెంపుదలను ఉపసంహరించాలని మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన వార్వా, నివాస్ సంఘాల సమావేశం ఆమోదించిన తీర్మానంలో కోరారు. ఇటీవల మృతిచెందిన వార్వా సంయుక్త కార్యదర్శి, అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి కెవి.రమణమూర్తి సంస్మరణ సభ ముందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రమణమూర్తి స్నేహశీలి, కార్య దీక్షాపరులని కొనియాడారు. ఆయన మరణం వార్వా, నివాస్ సంఘాలకు తీరని లోటు అన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువలను భారీగా పెంచిందని, ఈ పెంపుదల అమ్మకాలు, కొనుగోళ్లకే పరిమితం కాదని, దీని వల్ల ఆస్తిపన్ను కూడా భారీగా పెరగనుందని తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి ఇంటి పన్నును ఆస్తి పన్నుగా మార్చి భారీగా ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారని, ఆస్తిపన్ను 15 శాతానికి మించదని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఆనాడు చెప్పారని, కాని, ప్రతి ఏడాదీ 15 శాతం పెంచడం వల్ల ఏప్రిల్ 2021 నాటికి ఉన్న ఆస్తి పన్ను ఇప్పుడు 52 శాతానికి పెరిగిందని చెప్పారు.

చెత్త సేకరణ ఛార్జీలు నెలకు రూ.120 చెల్లించాలని ఇటీవల ప్రజలపై ఒత్తిడి చేస్తున్నారని, హైకోర్టులో చెత్త సేకరణ యూజర్ చార్జీలపై కూడా కేసు పెండింగ్‌లో ఉందన్నారు. గత ఏడాది ఆగస్టులో చెత్త సేకరణ చార్జీలు 5 కేటగిరీలుగా మార్చి తగ్గిస్తూ జివిఎంసి కౌన్సిల్ నిర్ణయించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసును గానీ, 5 కేటగిరీలుగా మార్చి కౌన్సిల్ చేసిన నిర్ణయాన్ని గానీ పట్టించుకోకుండా ప్రజలపై ఒత్తిడి చేయడం తగదని పేర్కొన్నారు. ఈ భారాలకు అదనంగా విద్యుత్తు ట్రూ ఆప్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ట్రూ ఆఫ్ చార్జీలు, ఇంధన చార్జీలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై నగర పరిధిలోని అన్ని అపార్ట్‌మెంట్లు, కాలనీలలో కరపత్రాలు పంచాలని, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, ధర్నాలు చేయాలని సమావేశం పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బిబి.గణేష్, నివాస్ అధ్యక్ష కార్యదర్శులు బి.గురప్ప, పిట్టా నారాయణమూర్తి, వివిధ జోన్ల నాయకులు వివి.ప్రభాకరరావు, ఆర్.బాబూరావు, కె.కిరీటం, జెపి.శర్మ, కె.సత్యవతి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిబి.గణేష్

టిటిడి శ్రీవాణి ట్రస్ట్‌కు భద్రత ఉందా..?

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : టిటిడి శ్రీవాణి ట్రస్టుకు భద్రత ఉందా అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం 2019లో శ్రీవాణి ట్రస్టు పెట్టిందన్నారు. రూ.10 వేల టికెట్ తెచ్చారని తెలిపారు. రూ.500 టికెట్, రూ.10 వేల టికెట్ వేర్వేరుగా ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. తాను కుటుంబంతో వెళ్ళినప్పుడు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తీసుకొచ్చిన రూ.10 వేలు టికెట్లు మూడు కొన్నానని, వాటికి ఎటువంటి రశీదూ ఇవ్వలేదని తెలిపారు. దేవుని ఖాతా ఉన్నప్పుడు శ్రీవాణి ట్రస్ట్ ఎందుకు పెట్టారన్నారు. ట్రస్ట్‌కు ఉన్న భద్రత ఏమిటి,ఎన్ని టికెట్లు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టిక్కెట్ అమ్మకం ద్వారా ట్రస్ట్‌కు ఎంత వచ్చిందో, ఆ సొమ్మును ఎక్కడ జమ చేస్తున్నారో ఎప్పుడూ చెప్పలేదన్నారు. నాలుగేళ్లుగా ఎన్ని టికెట్లు అమ్మారు,ఎవరు కొన్నారో వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. దేవుని సొమ్ము కొట్టేయాడానికి ట్రస్ట్‌లు పెట్టకూడదన్నారు. జగన్ కుటుంబం నుంచి ఈ దోపిడీని ఆపాలని డిమాండ్ చేశారు. విశాఖ ఎంపీ కుటుంబం కిడ్నాప్ అయితే ఇంతవరకు సిఎం జగన్ కనీసం మాట్లాడలేదన్నారు.

సొంత పార్టీ నేతలకే భద్రత కరువు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అధికార పార్టీ ఎంపీకే రక్షణ కల్పించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్ర మోహన్ ఆరోపించారు. విశాఖ జిల్లా బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటితో కలిసి ఆయన మాట్లాడారు.

గులియన్-బారే సిండ్రోమ్‌కు 'ఓమ్ని'లో మెరుగైన చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న న్యూరాలజిస్ట్ రాజ్‌కుమార్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గులియన్-బారే సిండ్రోమ్‌తో బాధపడిన మాణిక్యేశ్వర్ ప్రసాద్ (48)కు మెరుగైన చికిత్స అందించి నయం చేశామని ఓమ్ని ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఓమ్ని ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాణిక్యేశ్వర్ ప్రసాద్ తమ ఆసుపత్రిలో చేరే సమయానికి కళ్ళు తప్ప శరీరంలో మరేభాగమూ కదపలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. అతనికి ఐవిఐజి, ప్లాస్మా ఫెర్సిస్‌ను ఇచ్చినా రోగి పరిస్థితిలో మార్పు రాకపోవటంతో ఇంటెన్సివిస్ట్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ సతీష్‌చంద్ర నేతృత్వంలో 68 రోజులు ఐసియులో ఉంచి చికిత్స అందించామని తెలిపారు. ఆయనకు తరచూగా ఈ డిసాటనోమియా రావడం, కఫంతో ఊపిరితిత్తులు మూసుకుపోవడం జరిగిందని తెలిపారు. క్రిటికల్ కేర్ నర్సింగ్ బృందం, రెస్పిరేటరీ థెరపిస్టుల కృషితో ఆయన ఆరోగ్యంగా బయటికి రాగలిగారని పేర్కొన్నారు. ఎంతో కష్టతరమైన ఈ చికిత్సను అందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన న్యూరాలజిస్ట్ డాక్టర్ రాజ్‌కుమార్, క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సతీష్‌చంద్రను పలువురు అభినందించారు.

టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఎల్ఐసి డివిజనల్ లెవెల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 20 ఎల్ఐసి శాఖల క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకర్ నారాయణ, స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ బి.శ్రీనివాస్, ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ వరప్రసాద్, అధ్యక్షులు ఎం.కామేశ్వరి పాల్గొన్నారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శారదా ప్రసాద్ దాస్

48వ వార్డులో వీధి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి- సీతమ్మధార : 48వ వార్డు ఇందిరానగర్-1,2,3,4 జవహర్‌లాల్ నగర్, అల్లూరి సీతారామరాజ్ కాలనీ, మహాత్మాగాంధీ నగర్, జై భారత్‌నగర్, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్, జివిఎంసి బిజెపి ఫ్లోర్‌లీడర్ గంకల కవిత అప్పారావు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మంగళవారం వీధిదీపాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, 'గుడ్ మార్నింగ్ గంకల' కార్యక్రమంలో భాగంగా వార్డు పర్యటనలో వీధిదీపాల సమస్యను స్థానికులు తన దృష్టికి తెచ్చారని, వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో సంప్రదించి, సమస్యను వారి దృష్టికితీసుకెళ్లానన్నారు. ఈ మేరకు వారు స్పందించి, వార్డు పరిధిలోని 30స్థంబాలకు కొత్తగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారన్నారు. ఈమేరకు విద్యుత్ సిబ్బందితో కలిసి, దగ్గరుండి వీధిదీపాలను వేయించారు. ప్రజల కోరిక మేరకు తన అభ్యర్థనను మన్నించి వెంటనే వీధిదీపాలను వేసిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందిని వార్డు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలపై వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు స్పందిస్తున్న తీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

సమస్యల పరిష్కారానికి కృషి

సీతమ్మధార : వార్డు పరిధిలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని 25వ వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ అన్నారు. మంగళవారం వార్డు పరిధిలోని సీతంపేట క్లబ్ రోడ్, గొల్లవీధితో యుజిడి సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తేవడంతో తాగునీటి విభాగం ఎఇ రహీం, ఇంజినీరింగ్ విభాగం ఎఇ శ్రీరామ్మూర్తితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ రామకృష్ణ, నీటి విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, బోర రమణ, సారిపిల్లిగంగరాజు, బోరశ్రీను, బోర పోలారావు, పల్లా నూకరాజు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : యోగాతో ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపి.స్.భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి మాట్లాడుతూ యోగా ప్రాధాన్యతపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విస్తృతం ప్రచారం చేయాలన్నారు. సెయింట్ ఆన్స జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి ఆధ్వర్యంలో వలంటీర్లకు యోగా శిక్షణనిచ్చారు. ఇతర ప్రోగ్రాం అధికారులు వి. అంజలీదేవి, ఎన్.నదియా పాల్గొన్నారు,

డిగ్రీలో నూతన విద్యావిధానంపై 22న అవగాహన సదస్సు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు డిగ్రీలో నూతన విద్యా విధానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదస్సులో పాల్గొనాలని సూచించారు.

అదనపు ఎంఇఒగా గంగరాజు

ప్రజాశక్తి - అనందపురం: ఎంఇఒ-2గా కె.గంగరాజు మంగళవారం ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. చీడికాడ ఎంఇఒగా పనిచేసి బదిలీపై వచ్చారు. ఎంఇఒ-1గా పద్మావతి ఉండగా, అదనపు ఎంఇఒగా గంగరాజు బాధ్యతలు చేపట్టారు. నూతన ఎంఇఒ గంగరాజును యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.అర్. అంబేద్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల అధ్యక్షులు బిఎన్‌వి. కిరణ్ కుమార్, సీనియర్ నేత భాస్కర్, ఎస్‌విఆర్‌యస్ నాయుడు, దేవా నంద్, రాంజీ, గిడుతూరి రాజా శుభాకాంక్షలు తెలిపారు.



ఎంఇఒను అభినందిస్తున్న యుటిఎఫ్ టీచర్లు

'భౌ'బోయ్ కుక్కలు..!



- రెండు రోజుల్లో 14 మందికి కుక్కకాటు
- బయటకు కాలు పెట్టాలంటే భయం భయం
- ఆందోళన చెందుతున్న బాధితులు

ప్రజాశక్తి- భీమునిపట్నం: జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బ్యాంక్ కాలనీ, రాజలింగంపేట, డెక్కతిపాలెం, తగరపువలస, భీమిలి, ఉప్పాడ , కె నగరపాలెం ప్రాంతాల్లో రెండ్రోజుల వ్యవధిలోనే 14మందిని కుక్కలు కరవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బాధితుల్లో బ్యాంక్ కాలనీకి చెందిన ఎం.లక్ష్మి, ఎం.నాగమణి, రాజలింగంపేటకు చెందిన కె.రమణమ్మ, డెక్కతిపాలేనికి చెందిన కె శ్రీను, పి అప్పలరాజు, భీమిలికి చెందిన ఎస్.గౌతమ్, పి కీర్తి, తగరపువలసకు చెందిన పి. వెంకటేష్, బి తులసి, ఎన్ రాము, చిల్లపేటకు చెందిన డి రాంబాబు, కె.నగరపాలేనికి చెందిన డి రామారావు, ఉప్పాడకు చెందిన జి వీరేష్, తగరపువలస దరి గుడివాడ గ్రామానికి చెందిన డి అప్పలనరసమ్మ ఉన్నారు. బ్యాంక్ కాలనీ, డెక్కతి పాలెం ప్రాంతాలకు చెందిన ఐదుగురిని ఒకే కుక్క కరిచిందని బాధితులు అంటున్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తత అవసరం



కుక్క కాటు బాధితులకు ఆందోళన వద్దు, అయితే అప్రమమత్తంగా ఉండాలి. కుక్క కరిచిన వెంటనే సబ్బు, వేడి నీళ్లతో గాయాన్ని శుభ్రపరచాలి. రేబిస్ వైరస్ పోయేంత వరకు గాయం నుంచి రక్తస్రావం జరగనివ్వాలి. సమీప ప్రభుత్వా సుపత్రికి వెళ్లి, వైద్యుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. కరిచిన కుక్క మంచిదైనా, పిచ్చిదైనా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. భీమిలి ప్రభుత్వాసుపత్రిలో ఎఆర్‌వి అందుబాటులో ఉంది. కుక్క కరిచిన వెంటనే, మూడోరోజు, ఏడో రోజు, 28వ రోజున వ్యాక్సిన్ వేస్తాం.

డాక్టర్ ఎం ఫణికుమార్,
ప్రధాన వైద్యాధికారి, భీమిలి ప్రభుత్వాసుపత్రి

భీమిలి ఆసుపత్రిలో బాధితులకు చికిత్స

కుక్కకాటు బాధితులు భీమిలి ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు సకాలంలోనే స్పందించి చికిత్స అందించారు. చిన్న గాయమైన వారికి టిటి, ఎఆర్‌వి ఇంజిక్షన్లు, తీవ్రగాయమైన వారికి టిటి, ఎఆర్‌వితో పాటు ఎమినో గ్లోబిలెన్స్ ఇంజిక్షన్లు వేశారు.

గుంపులుగా వీధి కుక్కలు స్వైరవిహారం

తగరపువలస ఆదర్శనగర్, కొత్తపేట, కొండపేట, వెంకటేశ్వర మెట్ట, బంగ్లామెట్ట, బ్యాంక్‌కాలనీ తదితర ప్రాంతాల్లో వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తుండంతో అటుగా వెళ్లేందుకు జనాలు జంకుతున్నారు జివిఎంసి అధికారులు స్పందించి వీధికుక్కల బెడద నియంత్రించడంతోపాటు, అవి వృద్ధి చెందకుండా కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించాలని, ఉన్నవాటిని యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గణనీయంగా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదైన గణాంకాల ఆధారంగా గడచిన ఆరునెలల్లో భీమిలి ప్రాంతంలో పరిశీలిస్తే కుక్కకాటు బాధితులు సంఖ్య గణనీయంగా పెరిగినట్లు స్పష్టమౌతోంది. ఈ ఏడాది జనవరిలో 174 మంది, ఫిబ్రవరిలో 143, మార్చిలో 138, ఏప్రిల్‌లో 144, మేలో 178 మంది కుక్కకాటు బాధితులు భీమిలి ఆసుపత్రికి వైద్యానికి వచ్చారు. ఇక జూన్ నెలలో ఇప్పటికే 129 మంది కుక్కకాటు బాధితులు చికిత్స పొందారు.

అర్హులందరికీ ఇళ్లపట్టాలు

ప్రజాశక్తి -ములగాడ : అర్హులైన ప్రతిఒక్కరికీ నవరత్నాల్లో భాగంగా ఇళ్ల పట్టాలను అందజేయనున్నట్లు 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎకెసి కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆనందకుమార్ ఆధ్వర్యంలో రేకులషెడ్‌ల స్థానంలో అందరికీ పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల భవనం మరమ్మతుకు నిధులు

ప్రజాశక్తి-పద్మనాభం : శిథిలావస్థలో ఉన్న మండలంలోని అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతులకు మండల పరిషత్ నుంచి రూ.రెండు లక్షలు నిధులు మంజూరు చేశారని ఎంపిపి కె రాంబాబు తెలిపారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు పాఠశాల దుస్థితిని స్థానిక యువకులు విన్నవించగా, ఆయన సిఫార్సు మేరకు మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించామన్నారు. పాఠశాల భవనం, మరుగుదొడ్లు పూర్తిస్థాయి మరమ్మతులకు ఈ నిధులను వెచ్చిస్తామన్నారు. త్వరితగతిన నాణ్యతతో పనులు చేపట్టాలని ఎంపిపి సూచించారు. ఉప సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి-ఉక్కునగరం : జగన్నాధ స్వామి రథయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అగనంపూడి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న జగన్నాధస్వామి ఆలయం నుండి ప్రారంభమైన రథయాత్రలో భారీగా భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కార్పొరేటర్ బోండా జగన్నాధం, ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, సమర, గంతకోరు అప్పారావు, మామిడి నాయుడు, గల్లా రాజు, నర్సింగరావు, టిడిపి నేతలు రాజన్ రాజు, మూర్తి, అప్పలరాజు, యూరి రామస్వామి తదితరులు జగన్నాథస్వామిని దర్శించుకుని, రథయాత్రలో పాల్గొన్నారు

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రింగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఎంపిపి కె రాంబాబు పాల్గొని, పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న నలుగురు ఉపాధ్యాయులు పి.సన్యాసిరావు, ఆదినారాయణ, రెడ్డి, శ్రీనివాసరావులను సత్కరించారు. కొత్తగా 12మంది ఉపాధ్యాయులను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పాఠశాల అభివృద్ధి, అప్‌గ్రెడేషన్‌కు పిఎసిఎస్ చైర్‌పర్సన్ అమూజూరి అప్పారావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి- సింహాచలం: పాత గోశాల నుంచి అడివివరం వరకు బిఆర్‌టిఎస్ కారిడార్‌లో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు అధికారులు, నేతలు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని పాశర్ల ప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడుతూ, గడచిన నాలుగు సమావేశాల్లో బాధితులకు నష్టపరిహారాన్ని చెల్లించాకే పనులు ప్రారంభిస్తామన్న అధికారులు, ప్రజాప్రతినిధుల హామీకి భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. నిర్వాసితులకు నాలుగు టిడిఆర్‌లు చెల్లింపుతోపాటు స్థలాలు కోల్పోయిన వారిక 150 గజాల ఇళ్లస్థలం, పరిహారం చెల్లించాకే పనులు చేపడతామన్న ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కోరారు. సత్తివాడ శంకరరావు బాధితులు సి.కృష్ణారావు, డాక్టర్ రాజీవ్, గంటల తమ్మయ్య పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొని లోయలోకి దూసుకెళ్లిన కారు

- ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ: తాటిచెట్టును ఢీకొట్టిన కారు లోయలో పడిపోయిన ఘటనలో ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. కొయ్యూరు మండలం రావణాపల్లిలో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు వెళుతున్న కారు మంగళవారం గొలుగొండ ఎపి రెసిడెన్షియల్ స్కూల్ వద్ద తాటిచెట్టును ఢీకొని, లోయలోకి దూసుకుపోయింది. క్షతగాత్రులను నర్సీపట్నంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలబడగానే ఉన్నట్లు సమాచారం.

కస్తూర్బా విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక కస్తూర్భాగాంధీ బాలిక విద్యాలయం ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు గొలుగొండ ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల మేరకు.. గొలుగొండ కస్తూర్బా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఈ నెల 18వ తేదీ రాత్రి సమయంలో అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ జి.సుధ ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆర్‌టిసి బస్సు కింద పడి ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూటీ

ప్రజాశక్తి-ములగాడ : మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. స్థానిక పోలీసుల సమాచారం ప్రకారం, సింహాచలం డిపోకు చెందిన సింహాచలం టు సింధియా 55 సర్వీస్ ఆర్‌టిసి బస్సు, సింధియా వైపు వస్తుండగా సింధియా కాంప్లెక్స్ వద్ద మార్గమధ్యలో రేట్స్ బ్రేక్స్ ఫెయిల్ కావడంతో, డివైడర్‌ను ఢీకొట్టింది. అక్కడ రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడంతో రెండో వైపునున్న ప్రహరీని ఢీకొట్టే క్రమంలో అక్కడే స్కూటీపై ఉన్న నేవల్ ఉద్యోగి వైపు దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గమనించి నేవీ ఉద్యోగి స్కూటీని వదిలి పారిపోగా, స్కూటీతోపాటు అక్కడున్న దుకాణాలన్నీ ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో భారీ ప్రాణాపాయం తప్పిందని ప్రత్యక్షసాక్షలు అంటున్నారు. నేవలు ఉద్యోగి స్కూటీ నుజ్జునుజ్జు అయింది, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా క్రమబద్ధీకరించారు. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన ఆపాత మధురాలు



సంగీత విభావరిని ప్రారంభిస్తున్న ఫణిస్వామి, సన్‌మూర్తి, తదితరులు

ప్రజాశక్తి- సీతమ్మధార : స్వర తరంగిణి సంగీత సంస్థ ఆధ్వర్యంలో నూకల ప్రభాకర్ సమర్పణలో మంగళవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో 'కనులీవేళ చిలిపిగా నవ్వెను' శీర్షికతో నిర్వహించిన ఆపాత మధురాల సినీసంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఆధ్యాత్మికవేత్త సరిపల్లి ఫణిస్వామి, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, గాయనీగాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరానికి చెందిన పలువురు గాయకులు కె.పద్మావతి, బి కల్యాణి, సివి రాజేశ్వరి, కె.భాగ్యలక్ష్మి, నూకల రామనరసింహం, పెమ్మరాజు రామ్, ఎంవిఆర్ నాగేశ్వరరావు, నూకల ప్రభాకర్ పలు యుగళగీతాలు ఆలపించి, సంగీత ప్రియులను తన్మయుల్ని చేశారు. కార్యక్రమంలో చింతా ప్రభాకరరావు, లయన్స్ క్లబ్ నారాయణరావు, నాంచారయ్య పాల్గొన్నారు.

ఇళ్ల మరమ్మతులకు అనుమతులివ్వండి



ఇఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- సింహాచలం: పంచ గ్రామాలలో పాత ఇళ్లు మరమ్మతులకు అనుమతి ఇవ్వాలని సిపిఎం నేతలు కోరారు. ఈ మేరకు ప్రజల తరపున ఇఒకు వినతి పత్రాన్ని అందజేశారు. పంచగ్రామాల సమస్య పరిష్కారానికి నేతలు హామీలిస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని, దీంతో ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు పాడైనా వాటిలోనే బిక్కుబిక్కుమంటూ ప్రజలు జీవనం సాగించే పరిస్థితి ఉందన్నారు. ఉన్న ఇళ్లను మరమ్మతులు చేసుకునేందుకు పంచగ్రామాల ప్రజలకు అనుమతులివ్వాలని కోరారు. దీనిపై ఇఒ స్పందిస్తూ, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని హామిని ఇచ్చారు. ఇఒను కలిసిన వారిలో 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి వెంకటరావు సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు ఉన్నారు.

మూడో సెమిస్టర్ డిగ్రీ పరీక్ష ఫలితాల్లో కృష్ణా కాలేజీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ నర్సింగరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఎయు విడుదల చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు, ప్రిన్సిపల్ జె సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె చిట్టిరెడ్డి, ఐ రాజేష్‌కుమార్ తెలిపారు. ఆళ్ళ హరిత 9.52/10పాయింట్లు, లోహిత 9.32, ఉషారాణి 9.30 , కుసుమ 9.26, గాయత్రి 9.22, మౌనిక 9.11, రోహిణి 9.04, వర్షిణి, శైలజ 9.00, కె దేవి 8.38, పాయింట్లను సాధించారన్నారు. వీరిని కళాశాలలో కరస్పాండెంట్‌తో పాటు పలువురు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు

ఎన్‌టిఆర్ చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి-సీతమ్మధార : సినీ, రాజకీయ రంగాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఎన్‌టిఆర్, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా, చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని గీతం వర్సిటీ చైర్మన్ ఎం.శ్రీభరత్ అన్నారు. మంగళవారం సాయంత్రం వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపనతో దేశ రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించిన ఎన్‌టిఆర్, ఎన్నో సంక్షేమ పథకాలతో ఆదర్శనీయుడిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో వైజాగ్ ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, కోఆర్డినేటర్ బి చిన్నారావు, గౌరవాధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్ పాల్గొన్నారు

విద్యుత్ ఛార్జీల పెంపుపై సిపిఎం నిరసన



తగరపు వలసలో ఎఇకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు



పెందుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు,

ప్రజాశక్తి -తగరపువలస : పెంచిన విద్యుత్ ఛార్జీల తగ్గింపు, స్మార్ట్‌మీటర్లు పెట్టే యోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం భీమిలి జోన్ కమిటీ కార్యదర్శి రవ్వ నరసింగరావు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎఇ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు ఎస్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు

పెందుర్తి :పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని కార్మికనగర్ విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు జగన్ మాట్లాడుతూ, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ఎపుడో వాడిన విద్యుత్‌కు ఇపుడు బిల్లులు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే వైసిపి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు అప్పలనాయుడు, ఈశ్వరరావు, గోపి, రామారావు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో మెరిసిన 'ఆణిముత్యాలు'



సిఎం జగన్ నుంచి పురస్కారం అందుకున్న కల్పన



... ఆణిముత్యం ప్రోత్సాహకం అందుకున్న కస్తూర్బా విద్యార్థిని భారతి

ప్రజాశక్తి-భీమునిపట్నం : టెన్త్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించిన స్థానిక ఎపి ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని జామి కల్పన జగనన్న ఆణిముత్యాలు పురస్కారం కింద సిఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా రూ 75వేలు నగదు పురస్కారం అందుకున్నారని గురుకులం ప్రిన్సిపల్ కోడి రాంబాబు తెలిపారు. విద్యార్థిని కల్పన, తల్లిదండ్రులను సిఎం జగన్ అభినందించారన్నారు.జిల్లా స్థాయి నగదు పురస్కారం రూ 50 వేలు, నియోజకవర్గ స్థాయి పురస్కారం రూ 25వేలు, పాఠశాల స్థాయి పురస్కారం రూ 3వేలు నగదును తమ పాఠశాల విద్యార్థినులు దక్కించుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి ఆణిముత్యాలకు కస్తూర్బా విద్యార్థినులు

ఆనందపురం:మండలంలోని నేల్తేరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లోఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ఇచ్చే జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల అమరావతిలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నుంచి జిల్లాస్థాయిలో కస్తూర్బా విద్యాలయాల్లో టాపర్‌గా నిలిచిన ఎన్.భారతి రూ.50 వేలు నగదు పురస్కారాన్ని అందుకుంది. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి ముఖ్యమంత్రి నుంచి రూ.75 వేలు నగదు పురస్కారాన్ని అందుకుంది. నియోజకవర్గ స్థాయిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ద్వితీయస్థానంలో నిలిచి రూ.10 వేలు, పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు మరో రూ.3 వేలు నగదు బహుమతి అందుకుంది.
అలాగే ఇదే పాఠశాలకు చెందిన ఇ.రేవతి రాష్ట్ర స్థాయిలో తృతీయస్థానం సాధించి ముఖ్యమంత్రి నుంచి రూ.50 వేలు నగదు బహుమతిని, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.30 వేలు, పాఠశాలలో ద్వితీయ స్థానం సాధించి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి అందుకున్నారు.తమ పాఠశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి నగదు పురస్కారాలు దక్కడంపై కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

మానసిక ప్రశాంతతతో మంచి ఆరోగ్యం

షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అపర్ణ



డాక్టర్ అపర్ణ

జూన్ 21, ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా...

ప్రజాశక్తి -గాజువాక : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న నిర్వహిస్తున్నారు. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ప్రశాంతతతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని, అది యోగాతో సాధ్యమౌతుందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి, కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అపర్ణ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో మాట్లాడారు.
యోగా అంటే యజ అనే సంస్కృత పదం నుంచి వచ్చిందని, యజ అంటే ఏకం చేయడమని అర్థం. యోగాతో శరీరం, మనసు ఏకం చేయవచ్చని దీనిలోని పరమార్థం అన్నారు. ప్రపంచానికి భారతీయులు అందించిన అద్భుతమైన కానుక యోగాశాస్త్రమన్నారు. శాంతి కోసం యోగా నినాదంతో ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వెల్లడించారు.
యోగాతో రక్తప్రసరణ బాగా జరుగుతుందని, తద్వారా ప్రాణవాయువుతో కూడిన రక్తాన్ని శరీరంలోని అన్ని అవయవాలకు అందుతుందన్నారు. యోగాతో ఒత్తిడిని కలిగించే రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. మనసును దృఢంగా ఉంచడం, ఒత్తిడిని నివారించడం, మోకాళ్ల నొప్పులను దూరం చేయడం, మెదడు పనితీరును మెరుగుపరచడం ఇలా ఎన్నోర విధాలుగా యోగా దోహదపడుతుందని, రోజుకు కనీసం 20 నిమిషాలు యోగా చేస్తే ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండొచ్చన్నారు.
ఈ మధ్యకాలంలో జీవనశైలిలో మార్పులు, చెడు ఆహార అలవాట్లు, ఒత్తిడి, నిద్రలేమి, వాతావరణ కాలుష్యం తదితర కారణాలతో అనేక మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, యువకులు సైతం హార్ట్ ఫెయిల్యూర్‌తో చనిపోతున్నారన్నారు. సరైన వ్యాయామం, విశ్రాంతితో పాటు మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే గుండెను ఆరోగ్యంగా ఉంచొచ్చన్నారు. గుండె ఆరోగ్యానికి యోగాసనాలు దోహదపడతాయని, వీరభద్రాసనం, శీర్షాసనం, హలాసనం, భుజంగాసనం వంటి ఆసనాలతో గుండె సమస్యలకు దూరంగా చేయవచ్చన్నారు. అలుపు లేకుండా యోగసనాలు చేసేందుకు ప్రాణాయామంతో శ్వాసపై ధ్యాస పెట్టాలని డాక్టర్ అపర్ణ సూచించారు.

22న 'ఆదర్శ'లో ఐసిఐసిఐ బ్యాంకు జాబ్‌మేళా

ప్రజాశక్తి- పెందుర్తి : పెందుర్తిలోని ఆదర్శ డిగ్రీ కాలేజీలో ఐసిఐసిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని కాలేజీ ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా ప్రకటనలో తెలిపారు. ఐసిఐసిఐ పర్మినెంట్ ఆన్‌రోల్ ఉద్యోగం 'రిలేషన్ షిప్ మేనేజర్' ఉద్యోగానికి 25ఏళ్ల లోపు వయస్సు కలిగి, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన యువతీయువకులు అర్హులన్నారు. డిగ్రీ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని, వార్షిక వేతనం రూ.2.60 లక్షలు నుంచి, రూ.3లక్షలు వరకు వుంటుందని కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగినవారు బయోడేటా, అర్హతల ధ్రువీకరణలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆదర్శ డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి థియోఫిలస్ సూచించారు. మరిన్ని వివరాలకు 9182020936 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర



ప్రసాద వితరణలో కార్పొరేటర్ సునీత సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు రామకృష్ణాపురంలో పైడిమాంబ జాతర మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు.ఉదయం నుంచి ఆరిలోవ, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వైసిపి నేతలు అమ్మవారిని దర్శించుకుని, భక్తులకు ప్రసాదవితరణ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. మహిళల కోలాటం, తప్పెటగుళ్లు, కాంగో, డప్పులు, పులివేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామ అధ్యక్షులు వంకర బాబూరావు, కాకర గోవిందు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు, తదితరులు

ప్రజాశక్తి- సీతమ్మధార: 26వ వార్డు రామకృష్ణనగర్, లలితా నగర్ ప్రాంతాల్లో రూ.20లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సిసి డ్రెయినేజీల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. వార్డు ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో మంగళవీధి జంక్షన్‌లో ముఖ్యఅతిథి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మీ, ఎఇ శ్రీరామూర్తి, డైరెక్టర్ పాండవ శ్రీను, సీనియర్ నేతలు గండ్రేటి ఉగాది, అమ్మాజీ, యం.సునీల్, శేషు, హరికృష్ణ, ఫరూఖీ, రోయ్, పాల్, తరుణ్, సంతోష్, కనక, లలిత కుమారి, రమాదేవి, సుశీల పాల్గొన్నారు.

47వ వార్డులో గడపగడపకూ...

సీతమ్మధార : 47వ వార్డు రాంజీ ఎస్టేట్ -1, బాపూజీ నగర్, కప్పరాడ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు పాల్గొన్నారు .ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకుని, వాటికి పరిష్కార చర్యలకు ఆదేశించారు.కార్యక్రమంలో యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు వైసిపి నేతలు వసంతల అప్పారావు, సుకుమార్, అధికారులు, సచివాలయం సిబ్బంది,పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ ఛార్జీలపై సిపిఎం నిరసనలు



మునగపాకలో ధర్నాచేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు



అచ్యుతాపురం సబ్ స్టేషన్ వద్ద..



మాట్లాడుతున్న వెంకటరమణ, చిత్రంలో అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన అదనపు విద్యుత్ ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన జిల్లాలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమాలు చేశారు.

మునగపాక రూరల్ : స్థానిక విద్యుత్ సెక్షన్ ఆఫీస్ ఆవరణలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలపై అదనపు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కళ్ళు కప్పి దొడ్డిదారిన సర్దుబాటు ఛార్జీలు, ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్, ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో అదనపు విద్యుత్ భారాలు మోపి వినియోగదారులకు షాకు ఇచ్చిందని పేర్కొన్నారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతి ఏడాది పెంచుతున్న ఛార్జీలకు అదనంగా ఈ ఛార్జీలు వేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ, ఆళ్ల సూరిబాబు, దాడి సత్తిబాబు, ఆడారి రమణ, పీల రామారావు, వేగి సూరిబాబు, ఆడారి పరదేశి నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీల విధానం రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనబాబు మాట్లాడుతూ గతేడాది కరెంటు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్లు ప్రజలపై భారం వేయగా, ఇప్పుడు గత పది సంవత్సరాల నుండి వాడుకున్న కరెంటుకు సర్దుబాటు ఛార్జీల పేరు మీద జనం నెత్తిన రూ.6000 కోట్ల భారం మోపిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ, శెట్టి రమణ, కండిపల్లి సహదేవుడు, శెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కె.సోమినాయుడు మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో 25 వేల కోట్ల రూపాయలు ప్రజల నెత్తిన విద్యుత్ భారం మోపడం ఎంత న్యాయమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మి, ధర్మరెడ్డి సన్యాసిరావు, బి.సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : పెంచిన కరెంటు చార్జీలు వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఉపమాక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం పలు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్, మండల కమిటీ సభ్యులు ఎం.మహేష్, బి.రాము, పీక్కి రమణ, కోడా కాశీ, గోసల స్వామి, మామిడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం


నర్సీపట్నం టౌన్ : స్థానిక కష్ణ ప్యాలెస్ లో విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు జి. గురుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, ఇష్టారాజ్యంగా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారాలు వేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మీసాల సుబ్బన్న, అఖిలపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, కె.వి.సత్య ప్రభ, ఎ.ల్.వి.రమణ, భవాని, తిరుమలరెడ్డి, నంగిన రమణ, జి.రాజు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన

అనకాపల్లి : ప్రజలపై కరెంట్ చార్జీల భారాన్ని తగ్గించాలని, ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రతిపాదన విరమించుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో అనకాపల్లి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి అమర్నాథ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కర్యాక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు అప్పలరాజు, సన్యాసిరావు, రాజు, ఫణీంద్ర కుమార్, ఈశ్వర్రావు, ఎం.సత్తిబాబు, సాయి, రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



నక్కపల్లి మండలం ఉపమాక సబ్ స్టేషన్ వద్ద....



ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు



పశువైద్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రవి

మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి పర్యటించారు. ముందుగా పశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని పశు గణ వివరాలు, జరుగుతున్న స్కీముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. జిల్లా మొత్తం మీద పశుసంవర్ధక శాఖ స్టాప్ పొజిషన్, పాడుబడ్డ బిల్డింగ్ యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కశింకోట పశు వైద్య అధికారి అల్ఫోన్స్ జార్జ్, ఆళ్ల అప్పలనాయుడు డెయిరీ ఫారంకు కలెక్టర్‌ను తీసుకెళ్లారు. అక్కడ కలెక్టర్ సూపర్ నేపియర్ పశుగ్రాస క్షేత్రాలు సందర్శించారు. శైలజ స్ప్లిలింగ్ మెషిన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రసాదరావు , జగనన్న పాలవెల్లువ నోడల్ అధికారి పి బానుబాబు పాల్గొన్నారు అనంతరం కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. రికార్డులు, ల్యాబ్, గదులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి తిరుపతిరావు, తహశీల్దారు సత్యనారాయణ, ఎంపిడిఒ వివి రవికుమార్, సిబ్బంది సత్యనారాయణ, సత్యవతి పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామ సచివాలయాల్లో నూతనంగా చేపడుతున్న భూముల రిజిస్ట్రేషన్లు తగిన జాగ్రత్తలతో చేపట్టాలని స్థానిక సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం మండలంలోని గొండుపాలెం, కేకే.అగ్రహారం గ్రామాల్లో సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్లపై తగిన సూచనలు, సలహాలు అందజేశారు. పాత సర్వే నెంబర్ల స్థానంలో ఎల్పీఎం నెంబర్లు వచ్చాయన్నారు. డాక్యుమెంట్‌లో ఎటువంటి చిన్న పొరపాట్లు ఉన్న ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వీటిపై పూర్తి అవగాహన పెంచుకుంటే ఎటువంటి తప్పులు దొర్లవని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి ఏవై.పాత్రుడు, వీఆర్వో సబ్బవరపు ముత్యాల నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

104 వైద్య శిబిరం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : 104 వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం 104 వైద్య సేవలను ఆయన పరిశీలించారు. దీర్ఘకాలిక రోగులు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయన పలు సూచనలు చేశారు. పీహెచ్సీ వైద్యులు బి అనిల్ కుమార్ రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉమా మహేష్, ఏఎన్ఎం లు రేవతి, లక్ష్మీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో అర్హత ఉండి.. ప్రభుత్వ పథకాలు అందనివారు ఉండకూడదని, అర్హులందరికీ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. మండలంలోని బట్లపూడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిపత్రాలను అందజేశారు. గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన రోడ్లను మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ గొంతిన షాజవతి సత్యారావు, ఎంపీటీసీ మమ్మిన అప్పలనాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జన్ భాగీదారి'పై అవగాహన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి అంగనవాడీ కేంద్రంలో మంగళవారం జన భాగీదారి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచి వారి యొక్క ఆహారం అలవాట్లు, చురుకుదనం, భవిష్యత్తులో విద్యను అభ్యసించడానికి గల సామర్థ్యం అంగన్వాడీ సెంటర్ల ద్వారా పిల్లలకు ఏ విధంగా తర్ఫీదు ఇస్తామన్నది తెలియజేశారు. ఈ కార్యక్రమం సర్పంచ్ నూకరాజు, అంగన్వాడీ టీచర్లు అంజలి, భవాని, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నీ తానై...

- భర్తకు చేదోడుగా.. పిల్లలకు చెంతగా..
- తల్లి సత్యవతి మరణంతో తల్లడిల్లిన కుమార్తె, కుమారులు

ప్రజాశక్తి-గొలుగొండ



ఆదపురెడ్డి సత్యవతి (ఫైల్)

గొలుగొండ ప్రాంతంలో రాజకీయ నేపథ్యంలో పేరున్న కుటుంబాలలో ఆదపురెడ్డి వారి కుటుంబం ప్రముఖమైంది. మండలంలో చోద్యం గ్రామంలో తెలుగుదేశంకు మొదటి నుంచి ఈ కుటుంబం వారు ప్రాతినిధ్యం వహించిన ప్రతిసారీ విజయం సాధిస్తూ వస్తున్నారు. మండల పరిషత్‌లు ఏర్పడిన ప్రారంభ దశలో గ్రామానికి చెందిన ఆదపురెడ్డి సత్యనారాయణ ప్రత్యక్ష ఎంపిపిగా ఎన్నికయ్యారు. రాజకీయంలో తలమునకులై ఉంటున్న ఆయనకు సహచరిగా సేవలందించడమే కాకుండా, ఇంటికి వచ్చిన అతిథులకు, రాజకీయ నాయకులకు మర్యాదలకు లోటు రాకుండా ఓర్పుగా తన బాధ్యతను సత్యవతి నెరవేర్చేవారు. భర్త రాజకీయ బాధ్యతలలో బిజీగా ఉంటే, గృహిణిగా ఇంటి బాధ్యతలను నెరవేరుస్తూ వారి సంతానమైన కుమార్తె, ఇద్దరు కుమారులను తీర్చిదిద్దడంలో ఆమె ప్రాధాన్యతనిచ్చేవారు. ఎంపిపి పదవి అనంతరం అనారోగ్య కారణాలతో సత్యనారాయణ మృతి చెందగా, కుటుంబం పూర్తి



కుమారులతో సత్యవతి (ఫైల్‌ఫొటో)

బాధ్యతలను ఆమె తీసుకొని సంతానాన్ని తీర్చిదిద్దారు. ఇంటి యజమాని లేనప్పటికీ, ఆ లోటు తెలియకుండా బాధ్యతలు నిర్వర్తిస్తూ, భర్త ద్వారా సంక్రమించిన ఆస్తిని కాపాడుతూ, స్వయంగా వ్యవసాయ పనులు చేయిస్తూ కుటుంబ గౌరవాన్ని ఇనుమడింప చేశారు. కుటుంబానికి అంతా తానై నడిపించిన ఆమె ఆరోగ్యంగా ఉంటూ హఠాన్మరణం చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోయింది. ప్రస్తుతం పెద్ద కుమారుడైన గోపాలకృష్ణ తండ్రి బాటలో నడుస్తూ, గ్రామానికి సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. చిన్న కుమారుడు నాయుడు రైస్‌మిల్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

అమ్మ లేని లోటు తీర్చలేనిది



అన్ని విషయాల్లో దిక్సూచిగా ఉంటూ, నాన్న లేని లోటు తెలియకుండా అమ్మ మమ్మల్ని పెంచింది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఓర్పు, ఆలోచన పెంచడంలో అమ్మ నాకు అలవర్చింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉంటున్న ఆమె ఇప్పుడు లేకపోవడం తీరని లోటు. భౌతికంగా అమ్మ దూరమైనప్పటికీ, మా ఆలోచనల్లో ఎప్పుడూ అమ్మ మాతోనే ఉంటారు.

- ఆదపురెడ్డి గోపాలకృష్ణ,
పెద్ద కుమారుడు

అమ్మే సర్వస్వం



నాకు ఊహ తెలిసిన దగ్గర నుండి అమ్మే సర్వస్వం. నాన్న ప్రేమ లోటు లేకుండా అమ్మ నన్ను పెంచింది. అన్ని విషయాలను స్నేహితురాలిగా అమ్మతో చర్చించుకునే వాడిని. ఆమె ఇప్పుడు లేదనే ఆలోచన జీర్ణించుకోవడం చాలా ఇబ్బందిగా ఉంది. మాకు అంతా తానే ఉండే అమ్మ లేకపోవడం మా దురదృష్టం

- అదపురెడ్డి నాయుడు,
రెండవ కుమారుడు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లిలో జగనన్న ఇళ్ల కాలనీ నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. అనకాపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి గొర్లి సూరిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ 5,063 జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలలో కానీ, లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మించే ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. సొంత స్థలాలలో ఇళ్లు నిర్మించుకోదలచిన వారికి ఎల్పీసీలు పెండింగ్లో ఉంటే వాటిని కూడా త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి ఇళ్ల పట్టాలు రాని వారిని గుర్తించి, 90 రోజుల్లోగావారికి పట్టాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను 100 శాతం మంజూరు చేసామన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని అన్ని అంగన్వాడీ సెంటర్లలో టీవీలు ఏర్పాటు చేసేందుకు సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం 20 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు మంత్రి చెప్పారు. మండలంలోని అంగన్వాడీ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 1.30 కోట్ల రూపాయలు కేటాయించామని మంత్రి అమర్నాథ్ వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి అమర్నాథ్

ఉద్యోగుల గైర్హాజరు పై మంత్రి ఆగ్రహం

ఇదిలా ఉండగా మంగళవారం జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడం పట్ల మంత్రి అమర్నాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరందరికీ మెమోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

భూపతిపాలెంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని మల్లం శివారు భూపతిపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తురకలపూడి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి గ్రామస్తులకు వైద్య సేవలు అందజేశారు. 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండటంవల్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్తులుపాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం : గత శనివారం కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడిక గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా ఏసీ వాహనాన్ని కారు ఢీకొనడంతో మండలంలో ముద్దుర్తి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. అదే ప్రమాదంలో గాయపడ్డ బోడి సత్యనారాయణ(36) ముద్దుర్తి గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఐదుకు చేరింది.

తహశీల్దారును కలిసిన జెడ్పిటిసి

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ నూతన తహశీల్దార్గా బాధ్యతలు స్వీకరించిన పి కనకారావును పరవాడ జెడ్పిటిసి సభ్యులు పిఎస్ రాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వర రావు బూన అప్పలరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన దుస్సాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెన్నెల అప్పారావు, కల్పన రాజశేఖర్ , ఎంపీటీసీలు సప్పు సన్యాసిరావు , కన్నూరు శ్రీను, నాయకులు బుగిడి గోవిందరావు, నందవరపు శ్రీను, బండారు శ్రావణ్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా కోమల్లపూడి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి పంచాయతీని ఒక పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దానని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. కోమలపూడిలో భీమునిపట్నం నర్సీపట్నం రోడ్డుని ఆనుకొని ఉన్న చెరువు వద్ద చేపడుతున్న శివాలయం పార్క్ అభివృద్ధి పనులను కరణం ధర్మశ్రీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో లేనివిధంగా ఇక్కడ శివాలయం నిర్మిస్తున్నామని తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దామని చెప్పారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశ్వబ్రాహ్మణ చేతివృత్తి కళాకారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వ బ్రాహ్మణ సంఘం ఆర్టిజన్ విభాగ రాష్ట్ర కన్వీనర్ కొండమూరు బంగారు బాబు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వము ముద్రలోన్లు, ఆర్టిజన్ కార్డు సంపాదించుకుని తద్వారా చేతి వృత్తిదారులకు రుణాలు పొందే ఆర్థికంగా ఎదగాలన్నారు. అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మత్తుర్తి గంగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చేబోలు సూరిబాబు ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి దేవి ఆలయంలో మండపంలో అవగాహన సదస్సు జరిగినది. ఈ కార్యక్రమంలో నాయకులు కోటిపల్లి జెజి బాబు, కొమ్మోజు గోవిందరాజు, పొన్నాడ పెదబాబు పాల్గొన్నారు.

అతికిన బతుకులు షార్ట్ ఫిల్మ్కు అవార్డులు

ప్రజాశక్తి- సబ్బవరం : వికెఆర్ ఎంటర్ టైన్మెంట్స్, 24 ప్రేమ్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల వికెఆర్ ఎంటర్ టైన్మెంట్స్ షార్ట్ ఫిల్మ్ అవార్డులలో విశాఖకు చెందిన మెరుగుమాల శ్రీదేవికి ఉత్తమ మహిళా దర్శకులుగా అవార్డు లభించింది. హైదరాబాద్లో ప్రసాద్ ల్యాబ్లో ఈ నెల 17న శనివారం అవార్డులు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. మెరుగుమాల శ్రీదేవి నిర్మాణ దర్శకత్వంలో రూపొందిన అతికిన బతుకులు షార్ట్ ఫిల్మ్కు సంబంధించి ఉత్తమ మహిళా దర్శకులు అవార్డు శ్రీదేవికి అతికిన బతులు చిత్ర కథానాయకుడు ఆరిపాక ప్రసాదరావుకు ఉత్తమ నటుడు అవార్డు లభించాయి. అతికిన బతుకులు షార్ట్ ఫిల్మ్కు అవార్డు లభించడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న శ్రీదేవి

ఎమ్మెల్యే గారూ.. గ్రామాన్ని తరలించండి

దుప్పుతూరు గ్రామస్తుల మొర

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మండలంలోని దుప్పుతూరు గ్రామాన్ని తరలించాలని ఆ గ్రామస్తులు మంగళవారం గ్రామానికి విచ్చేసిన ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు విన్నవించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కన్నబాబు రాజు, డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార వర్మ గ్రామంలో ఇంటింటికి తిరిగారు. పరిశ్రమల పక్కన ఉండడం వల్ల కాలుష్యానికి గురవుతున్నామని, గ్రామాన్ని వేరొక చోటకు తరలించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. అనంతరం రైతులకు సబ్సిడీతో కూడిన వరి విత్తనాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోన సంధ్య బుజ్జి, జడ్పిటిసి సభ్యులు లాలం రాము, వైసిపి నాయకులు దేశం శెట్టి శంకర్రావు, కె విమల నాయుడు, రాజాన అప్పలకొండ, నర్మల కుమార్, పిన్నమరాజు వాసు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన అనకాపల్లి గవరపాలెం జగన్నాథస్వామి వారి తొలి రథయాత్ర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ మండపంలో ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి కళ్యాణం మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం రథంలో స్వామివారిని ప్రత్యేక అలంకరణతో ఊరేగించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ బివి.సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, వైసిపి నాయకులు దాడి రత్నాకర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో. కార్పొరేటర్లు పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కర్, ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ, ఆలయ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండల కేంద్రంలో జగన్నాథ స్వామి రథయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథ స్వామి గుడి వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకకాలంకరణలో రథంపై ఊరేగింపు చేపట్టారు. ఆలయ అర్చకులు సోమేశ్వర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మాడుగుల:మండల కేంద్రంలో మంగళవారం జగన్నాధ రథ యాత్ర ఘనంగా జరిగింది. ఉదయం నుండి ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం రథ యాత్రను అర్చకులు పండ నూకరాజు, ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు.

కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి -కశింకోట : కశింకోటలో శారదా నది ఒడ్డున ఉన్న కాలువ పనులను వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కాలువలు సక్రమంగా లేకపోవడంతో మంత్రి గుడివాడ అమరనాథ్ దృష్టికి తీసుకెళ్లి రూ.9 లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎర్రవరం గ్రామంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పసుపు కుంకుమలతో అమ్మవారిని పూజించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, డిసిసిబి మాజీ మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి రాము తదితరులు ఆలయంలో పూజలు చేశారు. పండగ సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలు, మందు గుండు సామాగ్రి వెలిగించారు.

అప్పారావుకు సన్మానం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్లో గత 71 రోజులుగా చలివేంద్రం వద్ద సేవలు అందిస్తున్న పిల్లి అప్పారావును మంగళవారం సన్మానించారు. స్థానిక ల్యాబ్ శ్రీను ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గ్రామ ప్రజల ఆర్థిక సాయంతో చల్లని మజ్జిగ ప్రతి రోజూ అందిస్తున్నారు. చలివేంద్రం ప్రారంభ రోజు నుండి సేవలు అందిస్తున్న పిల్లి అప్పారావును గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి చిన్ని సన్యాసినాయుడు అభినందిస్తూ సాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ యువత చిన్ని రాజీవ్, రెడ్డి నాగేశ్వరరావు, లగిశెట్టి శ్రీను, కడియాల తేజ, పెదపాటి కిరణ్ ఉపేంద్ర, వెలగా రాజీవ్, యువకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

జగనన్న సురక్ష పథకంపై మండలంలోని తైపురం సచివాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజలకు సచివాలయంలోనే అన్ని సేవలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ముచ్చకర్ల శ్రీను, బుదిరెడ్డి మంగ వాణి, పచ్చికూర మంగ వేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం ఎసి కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్ రావు, జెడ్పిటిసి సభ్యులు పిఎస్.రాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : జగనన్న సురక్షను జయప్రదం చేయాలని జిఎస్డబ్ల్యు ఎస్ఓ మంజులారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక ఎంపీడీఓ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్య కుమారి రాము నాయుడు, జెడ్పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, మండల జేసిఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాల నాయుడు తహసీల్దార్ బి.సత్యనారాయణ, ఈఓపిఆర్డీ మహేష్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం

కశింకోట : జగనన్న సురక్ష పథకంలో భాగంగా తేగాడ గ్రామం లోమంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ సురేష్ నాయుడు, ఇన్చార్జి ఇఓఆర్డి రమేష్, తేగాడ సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ తుంపాల మంగతాయారు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు


ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పళ్ళు పాలు అందించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్గా బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తూ వేల కుటుంబాలకు రక్తదానం చేస్తూ వారికి ప్రాణదానం చేయడమే కాకుండా అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. కరోనా సమయంలో హెరిటేజ్ ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించి బాధితులకు అండగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోడి వెంకట్రావు, కుప్పిలి జగన్మోహన్, బొడ్డేడ మురళి, మళ్ల గణేష్, విల్లూరి రమణబాబు, అంబోయిన శేషు, పోలిమేర నాయుడు, బుద్ద భువనేశ్వరరావు గుర్రాల వాసు కన్నమనాయుడు బుద్ద విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను జెడ్పిటిసి దొండా రాంబాబు మంగళవారం అందజేశారు. గాడి భవాని, తాండ్రంగి అశ్విని, బతిరెడ్డి నాగలక్ష్మికి నగదు, ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓగా విధుల్లో చేరిన ప్రధానోపాధ్యాయులు బుద్దా కాశీ విశ్వేశ్వరరావుకు సాలువతో కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల హైస్కూల్లో టెన్త్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వెలుగుల మధుశ్రీకి రూ.3వేలు, ప్రశంసా పత్రం అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పైల పూజితకు రూ.2వేలు, తృతీయ స్థానంలో నిలిచిన భవానికి రూ.వెయ్యి అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కాసు అంజిరెడ్డి, కట్టుమూరి శ్రీనివాసరావు, బిర్లా ప్రకాశరావు, అన్నం కృష్ణారావు, కోటిన శివ పాల్గొన్నారు.



ప్రతిభ పురస్కారాలు అందుకున్న దిబ్బిడి పాఠశాల విద్యార్థులు



రక్తదానం చేస్తున్న దాతలు

సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన
ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సిపిఎం, సిఐటియు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సిపిఎం నేత, కామ్రేడ్ సత్తిబాబు జ్ఞాపకార్థం మంగళవారం స్థానిక ఎరియా అసుపత్రి లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సిఐటియు నాయకులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతున్న సిపిఎం సేవా కార్యక్రమాలు నిర్వహింస్తుందన్నారు., భవిష్యత్‌లో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సుమారు 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి. స్వాతి, సీనియర్ నాయుకులు సాపిరెడ్డి నారాయణముర్తి, ఈరెల్లి చిరంజీవి, కె.రామకృష్ణ, కె.ప్రసన్న, డి.శివ, ఎస్. నాగరమణ, జి.రామకృష్ణ, బిసిటివి సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ సిహెచ్ వెంకటేష్, ప్రసాద్, రామారావు, సత్యానందం తదిరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

-సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ- సచివాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-పాయకరావుపేట: భూ యజమానుల ఆమోదంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామంలో ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఏ.బాలకష్ణ, బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి తెచ్చిన సిసిఆర్సి చట్టంతో గత నాలుగేళ్లుగా కౌలు రైతులు గుర్తింపు కార్డులకు నోచుకోలేదని తెలిపారు. దీంతో ఇన్పుట్ సబ్సిడీలు, రుణ సౌకర్యం, పంట నష్టపరిహారాలు భూ యజమానులే పొందుతున్నారన్నారు. వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులు అపార నష్టానికి గురై అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలకు బలై పోతున్నారని పేర్కొన్నారు.భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణం అందించాలన్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మోకిన మాణిక్యం, గంగిరెడ్డి శ్రీను, పి.ధనలక్ష్మి, టి సూరిబాబు, బోడపాటి రాజు, నాగరాజు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బాలకృష్ణ, నాయకులు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మాడుగుల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో కళాశాల నూతన భవనంలోకి మారిందని, తమ కళాశాలలో బిఎ, బికాం, బిఎస్సీ కోర్సులు వుండగా, కంప్యూటర్, వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 26 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు, జూలై 3న సీట్లు కేటాయించి 4 నుండి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9985670292, 850095593, 9494569121, 79812254 66 నబర్లకు సంప్రదించాలని కోరారు.



చేపడుతున్న రోడ్డు పనులు

రహదారి మరమ్మతు పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం నుండి చింతపల్లి వెళ్లే రోడ్డుకు మోక్షం కలిగింది. మున్సిపాలిటీ చింతపల్లి రోడ్ ఎక్సయిజ్ స్టేషన్ ఎదురుగా ఆర్అండ్‌బి రోడ్డు సంవత్సరాల తరబడి గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ దృష్టికి వైసీపీ నాయకులు, అడ్వకేట్, కౌన్సిలర్ బుల్లిదొర, రాము తీసుకువెళ్లారు. దీంతో, గుంతలు పూడ్చి రోడ్ మరమత్తులు చేశారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కొత్తకోట: యువకులు క్రీడల పట్ల దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సూచించారు. టి.అర్జాపురం గ్రామంలో పలువురు యువకులకు క్రికెట్ కిట్ మంగళవారం అందించారు. యువత వీడియో గేమ్స్ మోజులో పడి శారీరక శ్రమపై దృష్టి సారించక పోవడంతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. జూలై 8న వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నియోజ వర్గంలోని అన్ని మండలాల్లో యువతీ యువకులకు పలు క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నావన్నారు.నియోజక వర్గంలో ప్రధాన రహదారైన బిఎన్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా అప్రమత్తంగా వాహనాలను నడపాలని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ సూచించారు.



క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

ఎస్ఐకి పురస్కారం

ప్రజాశక్తి-రోలుగుంట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించడంతో మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా రోలుగుంట ఎస్సై నాగకార్తీక్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సైను పలువురు అభినందించారు.

తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు మొర



పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-కోటవురట్ల: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం సుంకపూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు స్థానికులు మొరపెట్టుకున్నారు. ప్రధానంగా ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. తమ రేషన్ కార్డులు తొలగించడంతో పథకాలు నిలిచి పోయాయని గ్రామస్తులు తెలిపారు.గ్రామంలో చెరువు స్థలంలో నిర్మితమవుతున్న వెల్నెస్ సెంటర్ వివరాలు రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో అధికారులతో సమావేశమై సంక్షేమ పథకాలు అందించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశి విశ్వనాథరావు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, గ్రామ సర్పంచ్ చిటికెల కాశీ లక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు విరాళం

ప్రజాశక్తి-మాడుగుల: గ్రామ దేవత జాతరకు టిడిపి నేత మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు రూ.10 వేలను అందించారు. తాటిపర్తి పంచాయతీ చిన కూర్మనాధపురం గ్రామంలో మోదమాంబ జాతరకు ఆయన మంగళవారం గ్రామానికి చేరుకొని విరాళం అందించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంద్రు కృష్ణ, తాతబాబు, రేవతి, అప్పారావు పాల్గొన్నారు.



పాల్గొన్న రామానాయుడు

మెగా వాటర్ ప్రాజెక్టును పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని ఉద్దండ పురంలో మెగా వాటర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి వాడుకులోకి తీసుకురావాలని తెలుగుదేశం పార్టీ నేతలు డిమాండ్ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ ప్రాజెక్టును పరిశీలించి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ హయాంలో పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించాలన్న సంకల్పంతో ఉద్దండపురంలో మెగా వాటర్ ప్రాజెక్టు పనులు చేపటామని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రంగులు వేసుకున్నారే తప్ప పూర్తి చేయలేదన్నారు. వెంటనే ప్రాజెక్టు పనులను పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నాయకులు వైయిబోయిన రమణ, వెలగా శ్రీనివాసరావు, దార్ల కృష్ణ, పక్కుర్తి నాగు, తుమ్మల వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న టిడిపి నేతలు



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

రూ.10 కోట్లతో సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-మాడుగుల: 17 పథకాల ద్వారా ఒక్క గ్రామానికి రూ.10 కోట్ల 16 లక్షల 85 వేలను ఖర్చు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మంగళవారం రెండవరోజు వీరనారాయణంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, కేవలం ఒక్క గ్రామంలో 4134 మందికి వివిధ పథకాల ద్వారా లబ్ది చేకూరిందన్నారు. వీర నారాయణం నుండి గదబూరు వరకు 48 లక్షలతో నిర్మించిన రహదారి ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టుకు కైలాసపట్నం ఎంపిక

ప్రజాశక్తి-కోటవురట్లం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష పథక పైలెట్ ప్రాజెక్టుగా కైలాసపట్నం గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామ సచివాలయంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ సచివాలయ, గ్రామ వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ, కుల, ఆదాయ, జనన మరణ ధ్రువపత్రాలు సహా మ్యుటేషన్, ఆధార్ నెంబర్ అనుసంధానం, ఓటర్ లిస్టు, సాగునీటి హక్కు కార్డులు, కౌలు రైతుల హక్కు కార్డులు వంటివి సకాలంలో అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణ, వైసిపి నాయకులు సిద్ధబత్తుల సత్యనారాయణ, ఏవో చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, వీఆర్వో శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ఎంఇఒ ప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-నక్కపల్లి: ఎంఈఓ డివిడి ప్రసాద్‌ను ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓగా విధులు నిర్వహించిన డివిడి ప్రసాద్ కే.కోటపాడు బదిలీ అయ్యారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ జయ రత్నకుమారి, ఎంపీపీ రత్నం, ఎంపీడీవో సీతా రామరాజు, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఈశ్వరరావు ఘనంగా సన్మానించారు.



సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి-రోలుగుంట: దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లి గ్రామంలో దళిత యువకుడు ఓలిమరక రాజేష్‌పై దాడి చేసిన పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓ భూవివాదంలో రాజేష్‌పై ఏప్రిల్ 17న ఆ గ్రామానికి చెందిన పెత్తందార్లు దాడి చేశారన్నారు. రాజేష్ దేవరాపల్లి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో నాలుగు రోజుల తర్వాత కేసు నమోదు చేసారని తెలిపారు. ఇప్పటికే రెండు నెలల కాలం గడుస్తున్నా దర్యాప్తు పేరుతో పోలీసులు కాలక్షేపం చేసి నిందితులను రక్షించే ప్రయత్నంలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి



కీ॥శే॥ ఆదపురెడ్డి సత్యవతి గారు

W/o ఆదపురెడ్డి సత్యన్నారాయణ (లేటు), మాజీ ఎంపిపి

చోద్యం, గొలుగొండ మండలం

మీ దృఢ సంకల్పం, కార్యదక్షత
మాకు ఆదర్శనీయం...
మీ ఆలోచనా దృక్పథం
మాకు స్ఫూర్తిదాయకం.
మీరు పంచిన ప్రేమామృత, మాధుర్యాలు
ఎన్నిటికీ మరువలేనివి మీరు మా నుండి
భౌతికంగా దూరమైనా...
మీ మధురస్మృతులు మా మదిలో
మెదులుతూనే ఉంటాయి.

ఆడిగర్ల అప్పలనాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎ.ఎం.సి చైర్మన్ కొత్తజోగంపేట

చిటికెల సాంభమూర్తి, టిడిపి మండల పార్టీ సీనియర్ నాయకులు, కొత్తమల్లంపేట

కొల్లు రాంబాబు, సర్పంచ్ కొత్తయల్లవరం

గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్, సర్పంచ్ పాతమల్లంపేట

చింతల లక్ష్మికాంతం, ఎంపిటిసి యేటిగైరం పేట

కర్రి నాయుడు, టిడిపి మండల యూత్ ప్రెసిడెంట్, కొమిర

గోలకొండ శ్రీకాంత్, అనకాపల్లి పార్లమెంటరీ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు, లింగంపేట

గొంతిన నరిసింగరావు, అనకాపల్లి పార్లమెంటరీ తెలుగుయువత కార్యదర్శి, లింగంపేట

కుచ్చర్లపాటి రవివర్మ, మాజీ ఎంపిటిసి, గుండుపాల కొత్తూరు

పైల ప్రసాద్, నర్సీపట్నం నియోజకవర్గ టిడిపి తెలుగుయువత ఉపాధ్యక్షులు, జోగుంపేట

భీమిరెడ్డి సత్యన్నారాయణ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు చీడిగుమ్మల

కామిరెడ్డి గోవిందు, గ్రామ కమిటీ అధ్యక్షులు, చీడిగుమ్మల

గుడివాడ గణేష్, లక్ష్మీదుర్గ సీలింగు వర్క్సు, చీడిగుమ్మల

బెల్లపు కొండలరావు, టిడిపి మాజీ మండల యూత్ అధ్యక్షులు పప్పుశెట్టిపాలెం

లగుడు అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పప్పుశెట్టిపాలెం

చిటికెల తారకవేణుగోపాల్, మాజీ జెడ్‌పిటిసి ఎ.ఎల్.పురం

పొట్టికూరి లక్ష్మణరావు, టిడిపి జిల్లా ఎస్టీ సెల్ కార్యవర్గ సభ్యులు

కొరుప్రోలు గోవిందరాజు, మండల కమిటీ సభ్యులు గుండుపాల కొత్తూరు

సుర్ల సీతారామమూర్తి (బాబ్జీ), మాజీ సర్పంచ్ జోగుంపేట

పారేపల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గొలుగొండ

పుల్లేటికుర్తి రమేష్, టిడిపి బిసి సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు, గొలుగొండ

రాయపురెడ్డి లక్ష్మీనాయుడు, టిడిపి యువత గొలుగొండ

గొల్లిరవి, టిడిపి నాయకులు అమ్మపేట

పైల లోవరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కొత్తమల్లంపేట

గెడ్డం సత్యన్నారాయణ, మాజీ సర్పంచ్ గింజర్తి

కారుప్రోలు ధర్మరాజు, చోద్యం

గెడ్డం శేషు, టిడిపి మండల పారీ బిసి సెల్ అధ్యక్షులు, చోద్యం

నాతిరెడ్డి అప్పనాయుడు, టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, చోద్యం

మాకిరెడ్డి రామునాయుడు (చెన్నారెడ్డి), చోద్యం

అడిగర్ల స్వామినాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు, చోద్యం

ఆదపురెడ్డి ప్రభాకర్, మాజీ సర్పంచ్, చోద్యం

పోకనాటి శ్రీను, మత్స్యకారసొసైటీ మాజీ చైర్మన్, గాధంపాలెం

పోకనాటి త్రిమూర్తులు, గాధంపాలెం

లాలం సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు, విప్పలపాలెం

లగుడు రామ్మూర్తి నాయుడు (నాని బాబు), ఆయుకట్టు నీటి సంఘం మాజీ అధ్యక్షులు, విప్పలపాలెం

గాదం నారాయణ ప్రసాద్, గాధంపాలెం

అనిమిరెడ్డి మారుతినాయుడు, వాయుపుత్ర మెడికల్స్, చోద్యం జంక్షన్

శీనంరెడ్డి కొండలరావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఎన్.కంఠారం

రూపల పి.నాయుడు, పుత్తడి గైరంపేట

పరవాడ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ లింగంపేట

మిడతాన సూర్యనారాయణ, టిడిపి నియర్ నాయకులు గైరంపేట

మరిశా వెంకట రమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు, లింగంపేట

గొంతిన తాతాజీ, లింగంపేట

తోకల కన్నబాబు, లింగంపేట

తోకల శివకుమార్, గైరంపేట

చింతల నారాయమూర్తి నాయుడు, మాజీ ఎంపిటిసి, ఎ.ఎల్‌పురం

పోతల శ్రీరామూర్తి, ఫైనాన్స్ వ్యాపారం, ఎ.ఎల్ పురం

కొరుప్రోలు మాధవరావు, మాజీ ఎంపిటిసి చోద్యం

మిడతాన రాంబాబు, రిటైర్డ్ ఉద్యోగి చోద్యం

గాడి సత్యన్నారాయణ, మాజీ వార్డు మెంబర్ గైరంపేట

పైల వెంకట రమణ, మాజీ ఉప సర్పంచ్ గైరంపేట

మిడతాన అప్పలనాయుడు, గైరంపేట

కొరుప్రోలు దొర బాబు, లింగంపేట

సందిపర్తి వెంకునాయుడు (తాతయ్యులు) లింగంపేట

మరిశా సత్యన్నారాయణ, లెక్చరర్, వివేకానంద కళాశాల, లింగంపేట

అగ్రహారపు శ్రీనివాసు, లింగంపేట

బొప్పన ప్రసాద్, టిడిపి నాయకులు సిహెచ్.నాగాపురం

బొడ్డు రమణ, టిడిపి నాయకులు చిన్నియ్యపాలెం

పెద్దాడ ప్రసాద్, లింగంపేట

కొండమంచిలి కొండలరావు, ప్రజాశక్తి విలేఖరి, లింగంపేట

గొలుగొండ మండలం - అనకాపల్లి జిల్లా